

రాత్రి సమయాల్లో భద్రత పెంచాలి

ఆస్పత్రుల్లో రాత్రి సమయాల్లో భద్రత పెంచాలి. రాత్రి సమయాల్లో మద్యం సేవించిన వారి న్యూసెన్స్ ఎక్కువగా ఉంటున్నాయి. వారు వైద్యులు, మహిళా సిబ్బందిని ఇబ్బంది పెడుతున్నారు. రోగులు కూడా భయపడుతున్నారు. సెక్యూరిటీని పెంచడం వల్ల రక్షణ ఉందన్న ధైర్యంతో విధులను నిర్వర్తించగలం . వైద్యులపై దాడులకు పాల్పడితే చట్టపరంగా పడే శిక్షల వివరాలతో కూడిన బోర్డులను ప్రదర్శించాలి.

– ఏఎండీ ఈజ్‌దాని, ఇన్‌చార్జ్ సూపరింటెండెంట్, ఏరియా ఆస్పత్రి, తాడిపత్రి



మనోధైర్యం కల్పించాలి

ఆస్పత్రుల్లో రాత్రింబవళ్లు వైద్యసేవలందిస్తున్న వైద్యులు, సిబ్బందికి భద్రత తప్పనిసరిగా కల్పించాలి. సుప్రీంకోర్టు సూచన మేరకు ప్రభుత్వాలు చర్యలు చేపట్టి, వైద్య సిబ్బందికి మనోధైర్యం కల్పించాలి. ఆస్పత్రుల్లో సెక్యూరిటీ గార్డులను నియమించి అనుమానాస్పద వ్యక్తులు, మద్యం సేవించిన వారిని గుర్తించి తగు చర్యలు చేపట్టాలి. ఆస్పత్రుల్లో సంబంధిత పోలీస్‌స్టేషన్లు, ఇతర హెల్ప్‌లైన్ నంబర్లు బోర్డుపై ఏర్పాటు చేయాలి.

– స్వాతి, మెడికల్ ఆఫీసర్, అర్బన్ హెల్త్‌సెంటర్, గుంతకల్లు



క్లుప్తంగా

ఔట్‌స్టాండింగ్ బ్లడ్ డోనర్ అవార్డు అందజేత



అవార్డు అందుకుంటున్న రెహమాన్

గుంతకల్లుటౌన్: రెడ్‌డ్రాప్ రక్తదాతల సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు, 139 సార్లు రక్తదానం చేసిన రెహమాన్ ఔట్ స్టాండింగ్ బ్లడ్ డోనర్ అవార్డు అందుకున్నారు. మెగాస్టార్ చిరంజీవి జన్మదిన వేడుకల సందర్భంగా హైదరాబాద్ శిల్పకళా వేదికలో జరిగిన అవార్డుల ప్రదానోత్సవంలో సినీ దర్శకులు బాబీ, వశిష్ట తదితరులు ఆయనను అవార్డుతో సత్కరించారు. రక్తదాతలను గుర్తించిన చిరంజీవి యువత వ్యవస్థాపకుడు స్వామినాయుడు తదితరులకు రెహమాన్ కృతజ్ఞతలు తెలిపారు.

నెట్టికంటుడికి రూ.లక్ష విరాళం



దాతకు తీర్థ ప్రసాదాలు అందజేస్తున్న దృశ్యం

గుంతకల్లు రూరల్: అనంతపురానికి చెందిన జె.నారాయణ స్వామి అనే భక్తుడు ఆదివారం కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి దేవస్థానానికి రూ.లక్ష విరాళం అందజేశారు. ఆలయ నిత్యాన్నదాన సత్రం నిర్వహణకు నగదు అందజేసినట్లు దాత తెలిపారు. ఈ సందర్భంగా అర్చకులు దాత కుటుంబ సభ్యుల పేరున ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయనకు స్వామి తీర్థప్రసాదాలను అందజేశారు.

ఘనంగా ఆరాధనోత్సవం



ప్రసంగిస్తున్న పాస్టర్ రెవరెండ్ విశ్వమోహన్

పామిడి: మండలంలోని అన్ని చర్చీలలో ఆదివారం ఆరాధనోత్సవం ఘనంగా నిర్వహించారు. స్థానిక సీఎస్ఐ చర్చిలో నిర్వహించిన ఆరాధనలో పాస్టర్ బీ విశ్వమోహన్ క్రైస్తవులను ఉద్దేశించి మాట్లాడారు. అన్ని విషయాల్లో దేవునికే ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. సర్వమానవ పాపపరిహారార్థం శిలువయాగమై మూడో దినాన మృత్యుంజయుడైన పునరుత్థానుడు యేసుక్రీస్తు ప్రభువు అన్నారు. కార్యక్రమంలో చర్చి సభ్యులు, వీరయ్య, జకరయ్య, పీసీ రత్నరాజు, బుజ్జిబాబు, రాజు, అబ్రహాం, రాజేష్, ప్రసాద్, పాస్టరమ్మ సువర్ణమ్మ, మెర్సీ, ప్రశాంతి, డాక్టర్ కమల, వాణి, రజని, శిరీష తదితరులు పాల్గొన్నారు.

మసీదు ప్రారంభోత్సవం



నూతన మసీదులో ముస్లిం మత పెద్దలు

గుత్తి: గుత్తి మున్సిపాలిటీ పరిధిలోని చెట్నేపల్లిలో ఆదివారం నూతనంగా నిర్మించిన మసీదు ప్రారంభమైంది. మున్సిపల్ చైర్‌పర్సన్ వన్నూర్‌బీ, కౌన్సిలర్ రూతమ్మ, వైఎస్సార్‌సీపీ పట్టణ కన్వీనర్ పీరా, ముస్లిమ్ మత పెద్దలు మసీదును ప్రారంభించారు. ఈ సందర్భంగా ముస్లిమ్ మత పెద్దలు నూతన మసీదులో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం అన్నదానం చేశారు.

విగ్రహాల ఏర్పాటుకు అనుమతి తీసుకోవాలి



మాట్లాడుతున్న సీఐ కౌలుట్లయ్య

శింగనమల: శింగనమల, నార్పల, గార్లదిన్నె మండలాల్లో వినాయక చవితి సందర్భంగా విగ్రహాలు ఏర్పాటుకు అనుమతి తీసుకోవాలని సీఐ కౌలుట్లయ్య తెలిపారు. ఆదివారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఆయన మాట్లాడుతూ వినాయక చవితి సందర్భంగా విగ్రహాలు ఏర్పాటుకు అయా పోలీస్‌స్టేషన్‌లో అనుమతులు తీసుకోవాలన్నారు. వినాయక చవితి సందర్భంగా ఘర్షణలకు పాల్పడితే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. వినాయక చవితిని సంతోషంగా, ప్రశాంతంగా జరుపుకోవాలన్నారు. అనంతరం మండలంలోని రౌడీ షీటర్లుకు కౌన్సెలింగ్ ఇచ్చారు. సమావేశంలో ఎఎస్ఐ చితంబరయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

మలుపు.. ప్రమాదాలకు పిలుపు

మలుపులు ప్రమాదాలకు నెలవుగా మారుతున్నాయి. తాడిపత్రి, గుంతకల్లు, శింగనమల నియోజకవర్గాల్లో పలు రహదారులపై హెచ్చరికబోర్డులు లేకపోవడంతో మలుపుల వద్ద వాహనదారులు తరచూ ప్రమాదాలకు గురవుతున్నారు. మలుపులు వద్ద చెట్లు ఏపుగా పెరిగి ఎదురుగా వస్తున్న వాహనాలు డ్రైవర్లకు కనపడక ప్రమాదాలు చోటుచేసుకుంటు న్నాయి. అధికారులు స్పందించి ప్రమాదాలు నివారణకు చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు.

- కనిపించని సూచిక బోర్డులు
- పట్టించుకోని అధికారులు



కుందనకోట, చింతలాయపల్లె మధ్య మలుపులతో కూడిన రహదారిలో సూచిక బోర్డులు లేని దృశ్యం

యాడికి: మలుపులు ప్రాణాలు తీస్తున్నాయి. ఎదురుగా వచ్చే వాహనాలు కన్పించకపోవడంతో వాటిని తప్పించబోయి ప్రమాదాలకు గురవుతున్నారు. యాడికి మండలంలో పలు గ్రామాలకు వెళ్లేందుకు పంచాయతీ రాజ్, ఆర్‌అండ్‌బీ రహదారులున్నాయి. మండల కేంద్రానికి వెళ్లే రోడ్డులో మలుపులు భయంకరంగా ఉన్నాయి. పచ్చారుమేకలపల్లె దాటిన తర్వాత వంక వద్ద రెండు చోట్ల, డంపింగ్ యార్డు వద్ద రెండు చోట్ల , కుందన కోట నుంచి చింతలాయపల్లె మీదుగా ఎనిమిది చోట్ల, చింతలాయపల్లె సమీపంలో రెండు చోట్ల, గుడిపాడు-కుందనకోట గ్రామాల మధ్యలో రెండు చోట్ల, వేములపాడు నుంచి నగరూరుకు పోయే రహదారిలో గల సచివాలయాల వద్ద, వెంగన్నపల్లె ఉన్నత పాఠశాల వద్ద, పుప్పాల గ్రామ సమీపంలో రెండు చోట్ల, చందన గ్రామం నుంచి దైవాల మడుగుకు పోయే రహదారిలో రెండు చోట్ల మలుపులు ప్రమాదకరంగా ఉన్నాయి. క్రాసింగ్‌ల వద్ద చెట్లు ఉండటంతో కూడా ఎదురుగా వచ్చే వాహనాలు కనబడటం లేదు. కాగా క్రాసింగ్‌ల వద్ద పరిమితికి మించి వేగంతో వెళ్లడం మూలంగా వాహనాలు ఢీ కొంటున్నాయి. ఒక్కోసారి అదుపుతప్పుతున్నాయి. తద్వారా ప్రమాదాలు జరిగి పలువురు మృతిచెందారు. మరికొందరు తీవ్రంగా గాయపడి శాశ్వత అంగవైకల్యానికి గురయ్యారు. రోడ్డు వేసేటప్పుడు మలుపుల వద్ద రేడియంతో కూడిన సూచిక హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలి. కానీ మండలంలో అవి ఎక్కడా కనిపించడం లేదు. మలుపుల వద్ద వాహనాల వేగానికి కళ్లెం వేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలి



చింతలాయపల్లె, కుందన కోట గ్రామాల మధ్యలో గల కొండ వద్ద దాదాపు అర కిలో మీటర్ దూరంలోనే ఎనిమిది మలుపులు ఉన్నాయి. ఇక్కడ పలు ప్రమాదాలు చోటుచేసుకున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. అధికారులు స్పందించి మలుపుల వద్ద సూచిక, రేడియం స్టిక్కర్లు వేయాలి. – వెంకటరామి రెడ్డి, గుడిపాడు

అధికారులు స్పందించాలి



యాడికి మండల కేంద్రానికి వచ్చే రహదారుల్లో చాలా చోట్ల ప్రమాదకర మలుపులు ఉన్నాయి. ఈ ప్రాంతాల్లో చాలా యాక్సిడెంట్లు జరిగాయి. సంబంధిత అధికారులు స్పందించి క్రాసింగ్‌లకు కొంచెం ముందుగా రేడియంతో సూచిక బోర్డులు, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలి.

– రవికుమార్‌రెడ్డి, కోనుప్పలపాడు

వైభవంగా సాయి శత రుద్రీయం



రుద్రాభిషేకం నిర్వహిస్తున్న భక్తులు

తాడిపత్రి అర్బన్: పట్టణంలోని సత్యసాయిబాబా ధ్యాన మందిరంలో సత్యసాయి సేవా సంస్థలు, రాష్ట్ర వేద అధ్యయన విభాగం ఆధ్వర్యంలో బాబా 100వ జయంతి వేడుకల సందర్భంగా సాయి శత రుద్రీయం 93వ మహన్యాస పూర్వక ఏకాదశి రుద్రాభిషేకాన్ని ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర సత్యసాయి వేద విభాగం ఇన్‌చార్జి హరిప్రసాద్‌శర్మ పర్యవేక్షణలో 40 మంది వేద పండితులు రుద్రాభిషేకాన్ని వేద మంత్రోచ్చారణల మధ్య ప్రారంభించారు అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. పెద్ద సంఖ్యలో మహిళా భక్తులు తరలివచ్చారు.

డీలర్‌పై కేసు నమోదు

పామిడి: పట్టణంలోని ఎఫ్‌పీ షాపు నెంబర్ 41 డీలర్ వడ్డే శీనాపై కేసు నమోదు చేసినట్లు సీఎస్‌డీటీ అన్సర్ ఆదివారం తెలిపారు. ఆకస్మిక తనిఖీలో బియ్యం, జొన్నల కోటాను డీలర్ అక్రమంగా విక్రయించినట్లు విచారణలో తేలిందన్నారు. మొత్తం బియ్యం 74 క్వింటాళ్లు, 6 క్వింటాళ్ల జొన్నలు మాయమైనట్లు గుర్తించి, డీలర్‌పై కేసు నమోదు చేశామన్నారు.

కార్మికుల అర్ధనగ్న నిరసన



బీకేఎస్‌లో ఆందోళన చేస్తున్న కార్మికులు



కల్లూరులో సమ్మె చేస్తున్న సత్యసాయి కార్మికులు

బుక్కరాయసముద్రం/గార్లదిన్నె: తమ సమస్యలు ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కోరుతూ ఆదివారం బీకేఎస్ మండల కేంద్రంలోని సత్యసాయి వాటర్ సరఫరా ప్రాజెక్ట్ కార్యాలయం ఎదుట నాలుగో రోజు అర్ధనగ్న ప్రదర్శనతో కార్మికులు ఆందోళన నిర్వహించారు. ఆ సంఘం నాయకుడు రాఘవేంద్రాచారి మాట్లాడుతూ సత్యసాయి వాటర్ ప్రాజెక్ట్‌లో బోర్డు ఎస్‌ఈ జీతాలు ఇవ్వకుండా ఇబ్బంది పెడుతున్నారన్నారు. 600 గ్రామాలకు నీటి సరఫరా ఆగిపోయినా అధికారులు స్పందించక పోవడం దారుణం అన్నారు. కార్మికులకు జీతాలు వెంటనే మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడుతామన్నారు. కార్యక్రమంలో కార్మిక సంఘం నాయకులు దేవదాస్, కిష్టప్ప, లక్ష్మీన్న, పెద్దన్న, నల్లప్ప, భాస్కర్ సాగర్, నారాయణ, నరేష్, విశ్వనాథ్ నరహరి, పోతులయ్య పాల్గొన్నారు. అలాగే గార్లదిన్నె మండలం కల్లూరులో నిర్వహించిన నిరసనలో సత్యసాయి కార్మికులు బాషా, నాగభూషణ, మల్లరా యుడు తదితరులు పాల్గొన్నారు.

నేడు కృష్ణాష్టమి వేడుకలు

గార్లదిన్నె: మండలంలోని కల్లూరులో సోమవారం శ్రీకృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు త్రైత సిద్ధాంతం ప్రబోధ సేవా సమితి హిందూ జ్ఞాన వేదిక సభ్యులు తెలిపారు.ఆదివారం వారు మాట్లాడుతూ ఏటా లాగే గ్రామంలో శ్రీకృష్ణుడి విగ్రహాన్ని కొలువుదీరుస్తామన్నారు. 29వ తేదీ ఊరేగింపు నిర్వహిస్తామన్నారు. శ్రీకృష్ణ భక్తులు అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని వారు కోరారు.

శింగనమలలో రేపు..

శింగనమల: శింగనమలలోని రాయాలయం వద్ద ఈనెల 27న కృష్ణాష్టమి వేడుకలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు ఆదివారం తెలిపారు. ఉదయం శ్రీకృష్ణ ఉత్సవ విగ్రహానికి అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వస్తామన్నారు. అనంతరం ఉట్టి కొట్టే కార్యక్రమానికి భక్తులు హాజరై విజయవంతం చేయాలన్నారు.

వ్యక్తిపై దాడి

తాడిపత్రి అర్బన్: ఓ వ్యక్తిని గుర్తు తెలియని వ్యక్తులు చితకబాదుతుండగా సర్ది చెప్పేందుకు వెళ్లిన వ్యక్తిపై కత్తితో దాడి చేసిన ఘటన ఆదివారం పట్టణంలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. పట్టణంలోని రంగనాయకులు ఆదివారం నంద్యాల రోడ్డులోని సూర్య స్కూల్ వద్ద ఉండగా తన స్నేహితుడు సాయి అనే వ్యక్తిపై కొందరు గుర్తు తెలియని వ్యక్తులు దాడికి దిగారు. అడ్డుకునేందుకు వెళ్లిన రంగనాయకులపై గుర్తు తెలియని వ్యక్తులు కత్తితో దాడికి దిగారు. గాయపడిని అతడిని స్థానికులు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్

నార్పల: మండల కేంద్రంలో అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను ఆదివారం సీజ్ చేసినట్లు సీఐ కౌలుట్లయ్య తెలిపారు. సీఐ మాట్లాడుతూ నిందితుడిపై కేసు నమోదు చేశామన్నారు. మండలంలో ఎవరైనా అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తే కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్

గార్లదిన్నె: స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఆదివారం కల్లూరు, ఇల్లూరు, మర్తాడుకు చెందిన 18 మంది రౌడీషీటర్లకు శింగనమల సర్కిల్ సీఐ కౌలుట్లయ్య కౌన్సెలింగ్ ఇచ్చారు. సీఐ మాట్లాడుతూ గ్రామాల్లో రౌడీషీటర్లు ప్రశాంత జీవనం సాగించాలన్నారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు తప్పవన్నారు. గ్రామాల్లో త్వరలో జరిగే వినాయక చవితి వేడుకల్లో అల్లర్లకు పాల్పడితే కేసులు నమోదు చేసి, చట్ట పరమైన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

వైభవంగా శ్రావణ మాస పూజలు

పెద్దపప్పూరు: శ్రావణమాసం మూడో ఆదివారం సందర్భంగా మండలంలోని చిన్నపప్పూరు గ్రామ సమీపంలో పెన్నానది ఒడ్డున వెలసిన అశ్వత్థనారాయణ స్వామి క్షేత్రానికి భక్తులు పోటెత్తారు. భక్తులు పెన్నానదిలో పుణ్యస్నానాలు ఆచరించి శింగరబట్లు, గణపతి, అశ్వత్తనారాయణ స్వామి, శ్రీవల్లి సుబ్రహ్మణ్యేశ్వర, చక్రభీమలింగేశ్వరులను దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. కోర్కెలు నెరవేరిన భక్తులు స్వాములకు ముడుపులు కానుకలతో పాటు తలనీలాలను సమర్పించారు. పెన్నానదిలో నీరు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో భక్తులు అటువైపు వెళ్లకుండా ఎస్ఐ గౌస్‌బాషా, ఈఓ ఆంజనేయులు తగుచర్యలు చేపట్టారు. కార్యక్రమంలో అర్చకులు బాలసుబ్రహ్మణ్యశర్మ, సుధీర్‌కుమార్ శర్మ,సునీల్‌కుమార్ శర్మ, భక్తులు పాల్గొన్నారు.

బుక్కరాయసముద్రం: మండల కేంద్రంలోని అమ్మవారి ఆలయాల్లో శ్రావణ మాసం సందర్భంగా భక్తులు ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహంచారు. మండల కేంద్రంలోని పెద్దమ్మ తల్లి ఆలయం, ముసలమ్మ కట్టవద్ద ముసలమ్మ ఆలయం, కాశీ విశాలాక్షి దేవాలయంలో భక్తులు ఉదయాన్నే అభిషేకాలు, కుంకుమ అర్చనలు చేశారు.



పెద్దపప్పూరులో స్వామిని దర్శించుకుంటున్న భక్తులు

గార్లదిన్నె: మండలంలోని కోటంక కొండల్లో వెలసిన గుంటి సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం ప్రధాన అర్చకుడు రామాచార్యులు క్షీరాభిషేకం, పంచామృత అభిషేకం, ఆకుపూజ, అర్చనలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు అన్న దాన కార్యక్రమం నిర్వహించారు.

తాడిపత్రి రూరల్: మండలంలోని యుగుడూరు వద్ద గంగమ్మతల్లికి ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో దేవాలయ ప్రాంగణం కిటకిటలాడింది. అమ్మవారికి భక్తులు బోనాలు సమర్పించారు.

ఘనంగా వీహెచ్‌పీ ఆవిర్భావ దినోత్సవం

గుంతకల్లుటౌన్: విశ్వహిందూ పరిషత్ షష్టి పూర్తి సంవత్సరపు ముగింపు వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆదివారం స్థానిక కోదండరామస్వామి ఆలయంలో ఏర్పాటు చేసిన వేడుకలకు డాక్టర్ కరిబసవ రాజేంద్రస్వామి, వీహెచ్‌పీ విభాగ్ కార్యదర్శి వేణుగోపాల్ హాజరయ్యారు. 60 ఏళ్లుగా హిందూ ధర్మ పరిరక్షణ, మతమార్పిడులను అరికట్టడమే కాకుండా గో సంరక్షణతో పాటు వీహెచ్‌పీ నిర్వహిస్తున్న సామాజిక సేవాకార్యక్రమాలను వారు కొనియాడారు. కార్యక్రమంలో వీహెచ్‌పీ పట్టణ అధ్యక్షుడు మాణిక్‌చంద్ కార్వా, బజరంగ్‌దళ్ రాష్ట్ర కోకన్వీనర్ సి.రవి, వీహెచ్‌పీ అనుబంధ సంఘాల ప్రతినిధులు గద్వాల్ ప్రతాప్, జయలక్ష్మి, బిందు, కవిత, మధుమతి, పద్మ, మోహన్‌నాయుడు, అశ్విని తదితరులు పాల్గొన్నారు.



ప్రసంగిస్తున్న కరిబసవ రాజేంద్రస్వామి

యువకుడి ఆత్మహత్య

గుత్తి: పట్టణంలోని చెర్లోపల్లి కాలనీలో నివాసముండే సోమశేఖర్ (27) ఆదివారం రాత్రి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల వివరాల మేరకు.. సోమశేఖర్ ఓ హోటల్‌లో మేనేజర్‌గా పని చేస్తున్నాడు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో చీరతో ఇంటి దూలానికి ఉరేసుకుని మృతిచెందాడు. పోలీసులు సంఘటనా స్థలంలో సూసైడ్ నోట్ స్వాధీనం చేసుకున్నారు. తన చావుకు ఎవరూ కారణం కాదని, 'అమ్మా నన్ను క్షమించు నిన్ను వదిలి పోతున్నా' నోట్‌లో రాశాడు. తాను మేనేజర్‌గా పని చేసే హోటల్ నిర్వాహకులు తనకు ఐదు లక్షలు డబ్బు ఇవ్వాల్సి ఉందని, హోటల్ నిర్వాహకులు తన కుటుంబ సభ్యులకు ఆ డబ్బు ఇవ్వాలని సూసైడ్ నోట్‌లో రాశాడని పోలీసులు చెప్పారు. ఎస్ఐ నబీ రసూల్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు

గుత్తి రూరల్: మండలంలోని రజాపురం గ్రామ శివారులో 67వ నంబర్ జాతీయ రహదారిపై ఆదివారం ద్విచక్రవాహనం అదుపుతప్పి బోల్తా పడి ఆనంద్ అనే యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసుల వివరాల మేరకు.. కర్నూలు జిల్లా తుగ్గలి మండలం రాంపురానికి చెందిన ఆనంద్ అనే యువకుడు గుంతకల్లు మండలంలోని వైటీ.చెరువులో బంధువుల వివాహ వేడుకకు ద్విచక్రవాహనంలో బయలుదేరాడు. రజాపురం గ్రామ శివారులో ద్విచక్రవాహనం అదుపుతప్పి బోల్తా పడింది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఆనంద్‌ను స్థానికులు 108లో గుత్తి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అనంతరం అతడిని అనంతపురానికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వ్యక్తికి గాయాలు

యాడికి: ద్విచక్ర వాహనం అదుపు తప్పి ఓ వ్యక్తి తలకు తీవ్ర గాయాలైన సంఘటన మండల కేంద్రంలోని వెంగమనాయుడి కాలనీలో ఆదివారం రాత్రి 8 గంటల సమయంలో చోటు చేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. వెంగమనాయుడి కాలనీకి చెందిన రమేష్ ద్విచక్ర వాహనంలో గాంధీ సర్కిల్ వద్దకు బయలుదేరాడు. కెనరా బ్యాంకు సమీపంలో ఎదురుగా వస్తున్న బస్సును తప్పించబోయి ద్విచక్ర వాహనం అదుపు తప్పి కింద పడ్డాడు. దీంతో రమేష్‌కు తలకు తీవ్రగాయాలయ్యాయి. గమనించిన స్థానికులు అతడిని యాడికిలో ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం తాడిపత్రికి తరలించారు.

ఇద్దరికి గాయాలు

గుత్తి: గుత్తి ఆర్ఎస్ రోడ్డులో కేంద్రీయ విద్యాలయం వద్ద ఆదివారం కారు రోడ్డు డివైడర్‌ను ఢీకొని ఇద్దరు గాయపడ్డారు. వివరాలు.. పత్తికొండకు చెందిన ఓ కుటుంబం కారులో పామిడికి బయలుదేరారు. అయితే మార్గ మధ్య(కేంద్రీయ విద్యాలయం వద్ద)లో కారు రోడ్డు డివైడర్‌ను ఢీ కొంది. ఘటనలో కారులో ప్రయాణిస్తున్న ఇద్దరు వ్యక్తులు గాయపడ్డారు. కారు ముందర భాగం పాక్షికంగా దెబ్బతింది. పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

మా వాళ్లకే రేషన్ షాపులివ్వాలి

- అధికారులపై టీడీపీ నాయకుల ఒత్తిళ్లు
- ఎమ్మెల్యే చెప్పాడంటూ హుకుం
- తలలు పట్టుకుంటున్న అధికారులు


పామిడి: మేం చెప్పిన వారికే రేషన్ షాపులు ఇవ్వాలంటూ టీడీపీ నాయకులు అధికారులపై ఒత్తిడి చేస్తున్నారు. ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం చెప్పాడంటూ ఒత్తిడి చేస్తుండడంతో వారు తలలు పట్టుకుంటున్నారు. వివరాలు.. పామిడి మండలంలో మొత్తం 50 ఎఫ్‌పీ షాపులు ఉన్నాయి. ఆ షాపులకు 15,300 రేషన్‌కార్డులు ఉన్నాయి. అందులో 14 ఎఫ్‌పీ షాపులకు పర్మినెంట్ డీలర్లు ఉన్నారు. మిగతా 36 ఎఫ్‌పీ షాపులకు తాత్కాలిక డీలర్లు ఉన్నారు. ఇప్పటికే ఎమ్మెల్యే ఆదేశాలతో 36 మంది తెలుగు తమ్ముళ్లకు అధికారులు టెంపర్వరీ ఎఫ్‌పీ షాపులను కేటాయించారు. అంతటితో ఊరుకోక.. ఎమ్మెల్యే చెప్పారంటూ పర్మనెంట్ ఎఫ్‌పీ షాపులను సైతం మాకే ఇవ్వాలంటూ...టీడీపీ నాయకులు అధికారులపై ఒత్తిడి తెస్తున్నారు. ఇది అధికారులకు తలనొప్పిగా మారింది. మరీముఖ్యంగా మొన్నటిదాకా గత ప్రభుత్వ హయాంలో నాయకుడిగా చెలామణి అయ్యి, తీరా ఎన్నికలప్పుడు టీడీపీలో చేరిన ఓ వ్యక్తి రేషన్‌షాపుల కేటాయింపులో చక్రం తిప్పుతుండడం విశేషం. ఇదిలా ఉండగా.. ఇప్పటికే తాత్కాలిక ఎఫ్‌పీ షాపులను ఎమ్మెల్యే అత్యధికంగా బీసీల్లోని తన సామాజిక వర్గానికే ప్రాధాన్యత ఇవ్వడంపై మిగతా బీసీ, ఇతరత్రా వర్గాల్లో అసంతృప్తి రాజుకుంటోంది. సీఎం చంద్రబాబు తన రెండు నెలల పాలనలో చేపట్టిన ఎమ్మెల్యేల పనితీరులో గుమ్మనూరుపై అసంతృప్తి పెల్లుబికినట్లు అధికారపార్టీలోనే గుసగుసలు వెల్లువెత్తుతున్నాయి.



నిందితులను కఠినంగా శిక్షించాలి

తాడిపత్రి అర్బన్: దళితున్ని హత్య చేసిన నిందితులను వెంటనే శిక్షించాలని ఏపీ ఎమ్మార్పీఎస్ నాయకులు డిమాండ్ చేశారు. శనివారం పట్టణంలోని జయనగర్‌కాలనీకి చెందిన మసీలం రాజేంద్రపై తిప్పారెడ్డి, అతని కుటుంబ సభ్యులు పాశవికంగా దాడి చేసి హత్య చేశారన్నారు. ఆదివారం ప్రభుత్వాస్పత్రిలో మసీలం రాజేంద్ర మృతదేహం వద్ద ఎమ్మార్పీఎస్ నాయకులు నివాళులర్పించారు. అనంతరం మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈసందర్భంగా ఎమ్మార్పీఎస్, ప్రజా సంఘాల నాయకులు మాట్లాడుతూ రాజేంద్రను హత్య చేసిన వారిపై 24 గంటల్లో చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే మృతుడి కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.20 లక్షలు పరిహారం చెల్లించి, మృతుడి భార్యకు ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. పిల్లలను రెసిడెన్షియల్ పాఠశాలలో చదివించాలన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రామాంజనేయులు, ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ కమిటీ సభ్యుడు ఎల్లప్ప, నాయకులు పెద్దిరాజు, పుల్లయ్య, పి.రాజారత్నం, శ్రీనాథ్, అరుణ్, శివుడు, జంజాల పుల్లయ్య, వీరయ్య, మనోహర్, నాగరాజు తదితరులు ఉన్నారు.

గౌతమిపురి నగర ఉత్సవ కమిటీ ఏర్పాటు



గౌతమిపురి నగర ఉత్సవ కమిటీ సభ్యులు

గుత్తి: పట్టణంలోని వసుధ ఫంక్షన్ హాల్లో ఆదివారం నూతనంగా గౌతమిపురి నగర ఉత్సవ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కమిటీ అధ్యక్షుడిగా తెగడొడ్డి తిమ్మారెడ్డి, ఉపాధ్యక్షులుగా నాగయ్య రాయల్, శిరీష, నారాయణరెడ్డి, రామాంజనేయులు, జేకే రాము, ప్రధాన కార్యదర్శులుగా వెంకప్ప, శ్రీనివాసులు, రంగప్రసాద్‌రాయల్, మనోజ్ కుమార్, సహాయ కర్యాద మారాకుల రమణ, శివ శంకర్, శ్రీనివాసులు, రామకృష్ణ, నారాయణతో పాటు మరో పది మంది సభ్యులు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా కమిటీ అధ్యక్షుడు తిమ్మారెడ్డి మాట్లాడుతూ ఇక నుంచి ఏ ఉత్సవం జరపాలన్నా కమిటీ సభ్యులు ముందుంటారన్నారు. ప్రతి కార్యక్రమాన్ని, ఉత్సవాన్ని విజయవంతం చేయడానికి వంతు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో సత్యనారాయణ రెడ్డి, బండి సత్య, వీరోజీ, నాని, రొయ్యల నారాయణ తదితరులు పాల్గొన్నారు.